క్లుప్తంగా

ఫ్యాన్ల వితరణ



యర్రవరం శిశుమందిర్‌కు ఫ్యాన్లు అందజేస్తున్న దాత రామచంద్రరావు

ఏలేశ్వరం: యర్రవరం గ్రామంలోని సరస్వతి శిశుమందిర్‌కు మంగళవారం దాతలు ఫ్యాన్లు బహూకరించారు. పిఠాపురానికి చెందిన పెమ్మరాజు సత్యరామచంద్రరావు తన తండ్రి నాగభూషణరావు జ్ఞాపకార్థం శిశుమందిర్‌కు ఆరు సీలింగ్ ఫ్యాన్లు హెచ్‌ఎం తోట వీరరాఘవరావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతలు ముందుకు ఫ్యాన్లు అందజేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రబంధకారిని అధ్యక్షుడు భీశెట్టి పరదేశిరావు, జరికిపూడి శంకరరావు, తోట వీరమహేశ్వరరావు, గొల్లపూడి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ ఉపాధ్యాయులు



పేరవరంలో ఇళ్ల వద్దకు వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

ఏలేశ్వరం: బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఉపాధ్యాయులు పేరవరంలో మంగళవారం ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. గ్రామంలోని ఎంపీపీ పాఠశాల పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలకు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.సుందరరావు, శ్రీనివాసరావు, సత్యవేణి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం

శంఖవరం: జి.కొత్తపల్లిలో ఇటీవల షార్ట్ సర్క్యూట్‌తో రెండు తాటాకిల్లు దగ్ధమయ్యాయి. బాధిత కుటుంబాలు గొనగాల పార్వతి, పల్లా లోవతల్లిని కూటమి నాయకులు బద్ది రామారావు, వెన్నా శివ, పర్వత సురేష్, బాబి పరామర్శించి ఒక్కొక్కరికి 25 కేజీల బియ్యం, రూ.5వేల నగదును మంగళవారం అందజేశారు.

పదోన్నతిపై ఇద్దరి కార్యదర్శుల రాక

ప్రత్తిపాడు: ఇతర మండలాలకు చెందిన ఇద్దరు గ్రేడ్-5 కార్యదర్శులు పదోన్నతిపై ప్రత్తిపాడు మండలానికి వచ్చారు. రౌతులపూడి మండలం మల్లంపేట గ్రామ పంచాయతీ కార్యదర్శి జట్ల సౌమిత్ర ఉద్దండ జగన్నాథపురం పంచాయతీకి, కిర్లంపూడి మండలం రామచంద్రాపురం గ్రామ పంచాయతీ కార్యదర్శి తోట శివరామకృష్ణ మండలంలోని బవురువాక పంచాయతీకి పదోన్నతిపై గ్రేడ్-4 కార్యదర్శులుగా బదిలీపై వచ్చారు. వీరు మంగళవారం ప్రత్తిపాడు ఎంపీడీఓ కార్యాలయంలో రిపోర్టు చేశారు.

చెత్త తరలింపునకు ట్రాక్టర్లే మేలు

గండేపల్లి: గ్రామాలలో చెత్త తరలింపునకు ట్రాక్టర్లు ఉంటేనే మేలని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ జ్యోతుల నవీన్ తెలియజేశారు. జగ్గంపేట మండలం గుర్రప్పాలెం పంచాయతీకి మంజూరైన నూతన ట్రాక్టర్‌ను మంగళవారం వారి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతు గ్రామాలలో చెత్త తరలింపుకు చిన్న వాహనాలను ఉపయోగించడంతో పారిశుధ్య కార్మికులకు పని భారం ఎక్కువగా ఉండేదని, ట్రాక్టర్లు ద్వారా చెత్త తరలింపులో ఆ భారంబారం తగ్గుతుందన్నారు. నేతలు ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి పనుల ప్రారంభం



కామరాజుపేటలో సీసీరోడ్లు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

గోకవరం: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కూటమి ప్రభుత్వం లక్ష్యమని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలోని కొత్తపల్లి, కామరాజుపేట, తిరుమలాయపాలెం, మల్లవరం, గోకవరం గ్రామాల్లో పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా రూ.1.65 కోట్లతో నిర్మించిన సీసీరోడ్లను ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. అలాగే గోకవరంలో ప్రభుత్వాస్పత్రి సమీపంలో నూతనంగా నిర్మించిన జీఎల్ఆర్ ట్యాంకును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సాయిప్రసాద్, ఎంపీడీఓ గోవిందు, ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా బంగారుబాబు, మాజీ చైర్మన్ జనపరెడ్డి సుబ్బారావు, గాజింగం సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

చెత్త శుద్ధి లేదే..

- రోడ్లపైనే వ్యర్థాలు డంపింగ్
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు

తుని: ప్రజా ఆరోగ్యానికి పెద్దపీట వేస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో చెప్పిన మాటలు ప్రస్తుత పరిస్థితులను చూస్తే ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. గత ప్రభుత్వ హయంలో చెత్త పన్ను వేశారంటూ నానా యాగి చేశారు. అప్పట్లో పారిశుధ్యం కోసం అదనపు సిబ్బందితో పని చేయించారు. దానికి ప్రజలు చెల్లించిన పన్ను సొమ్మును వినియోగించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పారిశుధ్యం నిర్వహణ గాలికొదిలేసింది. రాష్ట్ర వ్యాప్తంగా అవుట్ సోర్సింగ్ కాంట్రాక్ట్‌ను రద్దు చేశారు. దీంతో మున్సిపాలిటీలకు సిబ్బంది కొరత నెలకొంది. రోజువారీ చెత్త సేకరణ కష్టంగా మారింది. పట్టణ పరిధిలో ఏర్పాటు చేసిన డంపర్ ప్లేస్ బిన్నుల్లో వేసిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించేవారు. ఇప్పుడు రెండు, మూడు రోజులకు ఒకసారి చెత్తను తరలిస్తున్నారు. డంపర్ బిన్లు ఉన్న ప్రాంతాల్లో వ్యర్థాలు నిల్వ ఉండిపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. ప్రజలు ముక్కు మూసుకుని వెళుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఇదే ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించినా పట్టించుకునే నాథులు కరువయ్యారు. రోడ్డు పక్క వ్యర్థాలు వేయడంతో పందులు అందులో తిష్ట వేశాయి. ప్రజలు ఇంకా ఏన్నాళ్లూ మాకు చెత్త కష్టాలంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి

పట్టణంలో 60 వేలకు పైగా జనాభా ఉన్నారు. 14 వేల కటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి రోజూ 15 వేల మంది వివిధ పనుల కోసం వస్తుంటారు. ఇళ్లు, హోటల్స్, కూరగాయలు, కిరాణా, పండ్లు, తినుబండారాలు తదితర కేటగిరిలో 39 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. వీటిని పారిశుధ్య కార్మికులు ఇంటింటికి వెళ్లి సేకరించి 40 శాతం తడి, పొడి చెత్తగా విభజించి కంపోస్టు యార్డులు(సంపద సృష్టి కేంద్రాలు)కు తరలిస్తున్నారు. ప్రధాన మార్కెట్‌లో వచ్చే బల్క్ వ్యర్థాలను పట్టణ శివారు ఇసుకలపేటతో పాటు తాండవ నది పరివాహిక ప్రాంతంలో వేస్తున్నారు. దీంతో నది జలాలు కలుషితమవుతున్నాయి. ముఖ్యంగా మార్కెట్ యార్డు, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి రోడ్డులో గుట్టలుగా వ్యర్థాలు వేస్తున్నారు. జీఎస్‌టీ రోడ్డు, సాయినగర్, బ్యాంకుకాలనీ తదితర ప్రాంతాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉంది.



గణపతినగర్‌లో డస్ట్‌బిన్ చుట్టూ చెత్త



మార్కెట్ యార్డు రోడ్డు పేరుకుపోయిన వ్యర్థాలు



బ్యాంకు కాలనీలో చెత్తలో సేద తీరుతున్న పందులు

కొలిక్కిరాని డంపింగ్ యార్డు

పురపాలక సంఘం ఏర్పడి ఐదు దశాబ్దాలు అవుతున్నా డంపింగ్ యార్డు స్థలసేకరణ అందని ద్రాక్షగా మిగిలింది. పట్టణానికి సమీపంలో స్థలసేకరణ చేయాలంటే కోట్లు వెచ్చించాల్సి రావడంతో కార్యరూపం దాల్చలేదు. గతంలో తుని మండలం రేఖవానిపాలెం, ఎస్.చామవరం ప్రాంతాల్లో స్థలసేకరణ కోసం ప్రయత్నించినా అక్కడ ప్రజలు వ్యతిరేకించారు. ప్రస్తుతం డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలంటే 3 ఎకరాల స్థలం అవసరం. ఇంత పెద్దమొత్తంలో సొమ్ము వెచ్చించే అవకాశం లేక పోవడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై అధికారులు దృష్టి సారించారు.

వ్యర్థాల డంపింగ్‌పై చర్యలు



పట్టణంలో ఎక్కడ పడితే అక్కడ వ్యర్థాలు డంపింగ్ చేయవద్దని అధికారులకు సూచనలు ఇచ్చాం. ప్రస్తుతం సిబ్బంది కొరత ఉంది. ప్రజలు ఇళ్ల దగ్గర తడి, పొడి చెత్తను వేరు చేసి ప్లాస్టిక్ డబ్బాలలో వేసి కార్మికులు అందజేయాలి. మార్కెట్లు, హోటళ్లు, దుకాణాల యాజమానులు ఆ ప్రాంతంలో ఏర్పాటు చేసిన డంపర్ బిన్లలో మాత్రమే చెత్త వేయాలని సూచనలు చేశాం. డంపింగ్ యార్డు స్థల సేకరణకు సంబంధించి తుని మండలం హంసవరం సమీపంలో డీ పట్టా భూమిని తీసుకునేందుకు ప్రతిపాదనలు పంపాం.

– వెంకట్రావు, కమిషనర్, తుని

చెత్త సేకరణపై దృష్టి పెట్టాలి



ప్రజలకు స్వచ్ఛమైన వాతావరణం ఉండాలంటే చెత్త సేకరణ, తరలింపుపై అధికారులు దృష్టి సారించాలి. రోజు వారీ చెత్తను డంపింగ్ చేయక పోవడంతో దుర్వాసన వస్తోంది. చెత్తలో పందులు తిష్ట వేస్తున్నాయి. గతంలో కంటే ప్రస్తుతం పారిశుధ్య నిర్వహణ సరిగా లేదు. దీనివల్ల ప్రజలకు అంటు వ్యాధులు వ్యాపించే అవకాశం ఉంది. ఉన్నతాధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలి.

– బి.గణేష్, వ్యాపారి, తుని

వైభవంగా శ్రీవారి తిరుమాస కల్యాణోత్సవం



కల్యాణోత్సవంలో స్వామి అమ్మవార్లు

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీవారి తిరు మాస కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం రాత్రి పాత సంచుల వర్తక సంఘం ఆధ్వర్యంలో అర్చకులు మాస కల్యాణ్యం జరిపించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి అమ్మవార్ల కల్యాణాన్ని తిలకించారు. తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

గోకవరం: ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. గోకవరంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పౌర సరఫరాల శాఖ ద్వారా రైతులు ధాన్యాన్ని ప్రభుత్వానికి అమ్ముకోవచ్చన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి ప్రభుత్వం రైతుకి 48 గంటల్లో నగదు జమ చేస్తుందన్నారు. అనంతరం ప్రభుత్వం ద్వారా సేకరించిన ధాన్యం లోడుతో కూడిన వాహనాలను ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు.

పార్టీ విజయమే ప్రథమ లక్ష్యం



కిర్లంపూడిలో గిరిబాబును మర్యాద పూర్వకంగా కలిసిన చింతలూరు వైఎస్సార్ సీపీ శ్రేణులు

కిర్లంపూడి: రానున్న రోజుల్లో వైఎస్సార్ సీపీ విజయమే ప్రథమ లక్ష్యం పనిచేయాలని ఆ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గం కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. కిర్లంపూడిలోని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం నివాసంలో ముద్రగడ గిరిబాబును ప్రత్తిపాడు మండలం చింతలూరు గ్రామానికి చెందిన నాయకులు, కార్యకర్తలు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. గ్రామంలోని రాజకీయ పరిస్థితులపై గిరిబాబుతో చర్చించారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ గ్రామంలోని పార్టీ సభ్యులంతా సమన్వాయంతో పని చేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఆయనను కలిసిన వారిలో బొడ్డు సూరిబాబు, దేశిరెడ్డి పాపారావు, సేనాపతి రాజబాబు, అవునుపల్లి లోవరాజు, గుర్రాల సత్తిబాబు, నూకరాజు తదితరులు ఉన్నారు.

ఎక్సైజ్ దాడులు

ప్రత్తిపాడు: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని కిర్లంపూడి మండలం కృష్ణవరం గ్రామంలో మంగళవారం సారా స్థావరాలపై ఎక్సైజ్ పోలీసులు విస్తృత దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 1,200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు ఆయన తెలిపారు. ఏలేశ్వరం మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఐదుగురు పాత నేరస్తులను అదుపులోకి తీసుకుని, వారిపై బైండోవర్ నమోదు చేశామన్నారు. వీరిని మంగళవారం ఏలేశ్వరం తహసీల్దార్ వద్ద హాజరుపరచినట్టు స్థానిక ఎక్సైజ్ సీఐ శివప్రసాద్ తెలిపారు.

వర్క్‌షాపులు నూతన ఆలోచనలకు దోహదం

గండేపల్లి: వర్క్‌షాపులు నూతన ఆలోచనలకు దోహదపడతాయని ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రోఛాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలియజేశారు. సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో 'అమెజాన్ వెబ్ సర్వీసులు క్లౌడ్ స్టోరేజ్' అనే అంశంపై ఐదు రోజులపాటు జరగనున్న వర్క్‌షాపును మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత టెక్నాలజీ రంగంలో పెరుగుతున్న అవకాశాలను గుర్తించి విద్యార్థులకు కీలకమైన నైపుణ్యాలను అందించగలదన్నారు. ఈ వర్క్‌షాప్‌లో ఏడబ్ల్యూఎస్ క్లౌడ్ కంప్యూటింగ్‌పై ప్రత్యేక శిక్షణతోపాటు ప్రాక్టికల్ అనుభవాన్ని పొందేలా కార్యక్రమాలు రూపొందించినట్టు డీన్ డోలా సంజయ్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చాన్సలర్ ఎంబీ శ్రీనివాస్, ప్రోవైస్ చాన్సలర్ రమాశ్రీ, విభాగాధిపతి ఎం.వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రేపు వాహనాలకు వేలం

ప్రత్తిపాడు: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని వివిధ కేసుల్లో పట్టుకున్న వాహనాలకు ఈనెల 10వ తేదీ ఉదయం 8 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు స్థానిక ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్ తెలిపారు. స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో నిర్వహించే ఈవేలం పాల్గొనేవారు నిర్ణయించిన ధరావత్తు సొమ్ము చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని చెప్పారు. వేలంలో వాహనం దక్కించుకున్నవారు మొత్తం సొమ్ము వెంటనే చెల్లించాలన్నారు. 18 శాతం లేదా 12 శాతం జీఎస్టీ సొమ్ము కూడా చెల్లించాలన్నారు. వేలంలో పాల్గొనే వారు ఆధార్ జీరాక్స్ తీసుకునిరావాలని ఎక్సైజ్ సీఐ సూచించారు.

ముద్రగడను కలిసిన జక్కంపూడి గణేష్



కిర్లంపూడిలో ముద్రగడతో మాట్లాడుతున్న జక్కంపూడి గణేష్ తదితరులు

కిర్లంపూడి: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నేత ముద్రగడ పద్మనాభంను ఆపార్టీ నేత జక్కంపూడి గణేష్ కిర్లంపూడిలో మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా వైఎస్సార్ సీపీ బలోపేతానికి తీసుకోవలసిన కార్యచరణపై చర్చించారు. ముద్రగడ పద్మనాభం మాట్లాడుతూ రాజకీయంలో జక్కంపూడి కుటుంబంతో తనకు ఏళ్ల తరబడి అనుబంధం ఉందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జక్కంపూడి కుటుంబానికి పార్టీలో క్రియాశీలక పదువులు ఇచ్చారన్నారు. వైఎస్సార్ సీపీ బలోపేతానికి గణేష్ ఎంతో కృషి చేశారన్నారు. రానున్న రోజుల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం అయ్యే వరకు శక్తివంచన లేకుండా కృషి చేయాలని ముద్రగడ అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గం కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు, తోట రామకృష్ణ, నరవ గోపాలకృష్ణ, ఎస్ఎస్‌బియూ సందీప్ తదితరులు ఉన్నారు.

అర్హులంతా ఓటర్లుగా నమోదు కావాలి

నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి శ్రీనివాసరావు



నాయకులతో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ప్రత్తిపాడు: నియోజకవర్గంలోని అర్హులంతా ఓటర్లుగా నమోదు కావాలని ప్రత్తిపాడు నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, జిల్లా బీసీ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకుడు ఎ.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ స్థాయి రాజకీయ పార్టీల నాయకులు, ఎన్నికల అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్లు 800 కంటే ఎక్కువ ఉన్న పోలింగ్ కేంద్రాలకు మరోకటి అదనంగా ఏర్పాటు చేసేందుకు అనువైన భవనాలను గుర్తించాలని సూచించారు. ఓటింగ్ సమయంలో వినియోగించుకునేలా సిద్ధం చేయాలని చెప్పారు. రెండు పోలింగ్ కేంద్రాలు పక్కపక్కనే లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. శిథిలావస్థలో, ప్రమాదకరంగా ఉన్న పోలింగ్ కేంద్రాలను గుర్తించి, వాటిని వేరే సురక్షిత ప్రాంతంలో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులు పకడ్బందిగా చేపట్టాలని ఎన్నికల అధికారులను ఆదేశించారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు ఇకపై ప్రతి నెలా 15వ తేదీ లోగా రాజకీయ నాయకులు, ఎన్నికల అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తామని ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎ.శ్రీనివాసరావు తెలిపారు. ఈసమావేశంలో ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి మండలాల తహసీల్దార్లు ఎం.సూర్యప్రభ, ఆనందకుమార్, నరేష్, ఎ.తాతారావు, ఏలేశ్వరం నగర పంచాయతీ కమీషనర్ ఎం.సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకుడు శేరు కృష్ణ, వివిధ రాజకీయ పార్టీల నాయకులు శింగిలిదేవి సత్తిరాజు, కొండపల్లి శ్రీను, కందిమళ్ల సామ్యేలు, రొంగల ఈశ్వరరావు, మొర్త వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా ఉమా వైద్యనాథేశ్వరుని కల్యాణం



కిర్లంపూడిలోని ఉమా వైద్యనాథేశ్వర స్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

కిర్లంపూడి: గ్రామంలో ఉన్న ఉమా వైద్యనాథేశ్వర స్వామివారి వార్షిక కల్యాణ మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఆలయ అర్చకులు బాదంపూడి ప్రసాద్ శర్మ, బాదంపూడి సూరిబాబు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. స్థానిక పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు.

రోగులకు పండ్ల పంపిణీ

గండేపల్లి: జగ్గంపేట సీహెచ్‌సీ (కమ్యూనిటీ హెల్త్ సెంటర్) సూపరింటెండెంట్, వైద్యులు టి.ప్రణీత్ అదే ఆస్పత్రిలో రోగులు, గర్భిణులు, బాలింతలకు మంగళవారం పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఆయన పుట్టిన రోజును పురస్కరించుకుని వీటిని అందజేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

వేతనదారుల బకాయిలు చెల్లించాలి



ఏపీఓ కుమారస్వామికి వినతిపత్రం అందిస్తున్న ఈశ్వరరావు

ప్రత్తిపాడు: మండలంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం వేతనదారులకు బకాయిలను తక్షణం చెల్లించాలని సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి రొంగల ఈశ్వరరావు డిమాండ్ చేశారు. ఉపాధి పనులు చేపట్టని గ్రామాల్లో వెంటనే ఉపాధి హామీ పథకం పనులు ప్రారంభించాలని ఆయన కోరారు. ఈ మేరకు మంగళవారం ప్రత్తిపాడులో ఉపాధి హామీ పథకం ఏపీఓ కుమారస్వామికి వినతిపత్రం అందజేశారు. రొంగల ఈశ్వరరావు మాట్లాడుతూ మండలంలో 4 నుంచి 11 వారాల వరకు ఉపాధి పనుల్లో పాల్గొన్న వేతనదారులకు వెంటనే వేతనాలను చెల్లింపులు చేపట్టలేదన్నారు. చేసిన పనికి వేతనాలు అందక కూలీలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. మండలంలోని చాలా గ్రామాల్లో ఉపాధి హామీ పనులు చేపట్టక పోవడం వల్ల కూలీలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. వెంటనే పనులు ప్రారంభించాలని, ప్రతి కార్మికునికి వంద రోజుల ఉపాధి పనులు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఐదు నెలల పాటు వేసవి అలవెన్సులు ఇవ్వడంతో పాటు పని ప్రదేశాలల్లో చల్లని నీరు, మజ్జిగ, ఓఆర్ఎస్, టెంటులు ఏర్పాటు చేయాలన్నారు. వేతనదారులకు కనీస వేతనం రూ.600 చెల్లించాలని రొంగల ఈశ్వరరావు కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ సభ్యులు ఎం.సతీష్‌కుమార్ తదితరులున్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి మృతి

కిర్లంపూడి: పురుగు మందు తాగి వ్యక్తి మృతి చెందిన సంఘటనపై కేసు నమోదైనట్టు మంగళవారం స్థానిక హెడ్‌కానిస్టేబుల్ ఎస్.వెంకటరమణ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. పెద్దాపురం మండలం చినతిరుపతి గ్రామానికి చెందిన కల్లటి సత్తిబాబు(57) కిర్లంపూడి మండలం సోమవరం గ్రామానికి చెందిన వీరవెంకట సత్యనారాయణకు ఇచ్చి వివాహం చేశాడు. మృతుడు సత్తిబాబు గత 7 నెలల నుంచి మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. ఇటీవల మృతుడు భార్య కూడా అనారోగ్యానికి గురవడంతో ఇద్దరు కుమార్తె ఇంటిలోనే ఉంటున్నారు. ఇరువురు అనారోగ్యం పాలవడంతో జీవితంపై విరక్తి చెంది సోమవారం ఊరు శివారున అరటి తోటలో కలుపు మందును సేవించాడు. దీంతో అపస్మారక స్థితిలో ఇంటికి చేరుకుని వాంతులు చేసుకోవడంతో కుటుంబ సభ్యులు ప్రత్తిపాడు సీహెచ్‌సీకి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం అర్థరాత్రి మృతి చెందాడు. మృతుడు కుమార్తె లావణ్య ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు ఎస్సై రమణ తెలిపారు.

చివరి లో కలవరం

- అడపా దడపా వర్షాలతో రైతన్నల ఆందోళన
- ఆదరా బాదరాగా రబీ వరి పంట ఒబ్బిడి



బెండపూడిలో వరికోత యంత్రంతో కోస్తున్న రబీ పంట

తొండంగి: ఆరుగాలం కష్టించి పండించిన పంట చివరలో అడపా దడపా కురుస్తున్న అకాల వర్షాలు రైతులను కలవరానికి గురిచేస్తున్నాయి. కష్టపడి పండించిన పంటను ఒబ్బిడి చేసుకునేందుకు ఆపసోపాలు పడుతున్నారు. మండలంలోని వ్యవసాయబోర్లు, పీబీపీ పరిధిలో మాత్రమే ఈ ఏడాది రబీ వరిసాగు దాదాపు ఐదువేల ఎకరాల్లో చేశారు. వ్యవసాయబోర్ల పరిధిలో సాగునీటి లభ్యత ఉండడంతో ముందుగానే వరినాట్లు వేశారు. ఈనేపథ్యంలో మెట్టప్రాంతమైన బెండపూడి, గోపాలపట్నం, కొమ్మనాపల్లి, ఎ.కొత్తపల్లి, సీతారాంపురం, రావికంపాడు, పి.ఇ.చిన్నాయపాలెం తదితర ప్రాంతాల్లో ముందుగానే వరిపంట కోత దశకు వచ్చాయి. గత కొద్ది రోజుల నుంచి వరి కోత యంత్రాలతో పంట కోత పనులు చేపట్టారు.

అకాల వర్షాలతో..

నాలుగు రోజుల నుంచి ఆకాశం మేఘావృతమై అడపా దడపా అకాల వర్షాలు కురుస్తుండటంతో మోస్తారుగా రైతులు ధాన్యం పంట ఒబ్బిడికి ఇబ్బందులుపడ్డారు. ఇటువంటి పరిస్థితుల్లో పంట ఒబ్బిడి కోసం రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షానికి పంటను ఒబ్బిడి చేసుకునేందుకు వరికోత యంత్రాలను వినియోగిస్తున్నారు. మరో పది రోజుల పాటు ఈ పనులు కొనసాగితే దాదాపు 80 శాతం నుంచి 90 శాతం విస్తీర్ణంలో పంట ఒబ్బిడి కానుంది. అదేవిధంగా రబీకి ముందు ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలను కుప్పలుగా వేసి భద్రపరిచిన పంటలను కూడా నూర్పిడి యంత్రాలతో ఒబ్బిడి చేయిస్తున్నారు. ఈ నేపథ్యంలో నిల్వ చేసిన ఖరీఫ్ పంట, ప్రస్తుత రబీ వరి పంటల ఒబ్బిడి వ్యవసాయ కూలీలకు, వరికోత యంత్రాలకు డిమాండ్ పెరిగింది. వాస్తవానికి గత ఐదేళ్లపాటు పంపా ఆయకట్టుకు రబీలో కూడా సాగునీరందింది. ఈ ఏడాది రిజర్వాయర్‌లో గేట్లు మరమ్మతులు, పోలవరం, పుష్కర కాలువ అక్విడెక్ట్ పనుల కారణంగా రబీకి సాగునీరు ఇవ్వలేదు. దీంతో మండలంలోని రబీ సాగు విస్తీర్ణం సగానికి పైగా తగ్గిపోయింది. కాగా పీబీపీ, వ్యవసాయ బోర్ల పరిధిలో పంటలను ఒబ్బిడి చేసుకునేందుకు రైతులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.



రబీ వరి పంటలను నూర్పిడి చేస్తున్న రైతులు